ఉపాధి పనులను పరిశీలించి అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర బృందం సభ్యులు

గ్రామీణ నీటి సరఫరాకు పురపాలిక భారం..!

◆ వసూలుకాని నిర్వహణ ఛార్జీలు ◆ గ్రామీణ తాగునీటి నిర్వహణకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గ్రామీణ తాగునీటి నిర్వహణపై బకాయిల భారం పడుతోంది. అనంతపురం జిల్లాలో బహుళార్థక రక్షిత తాగునీటి పథకం కింద 26 స్కీమ్‌లు నడుస్తున్నాయి. వీటి నిర్వహణకు ఏడాదికి రూ.51.21 కోట్లు కాగా, విద్యుత్ ఛార్జీలు మరో రూ.62.37 కోట్లు ఉండనున్నాయి. ఈ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయింపులేవీ ఉండటం లేదు. స్థానిక సంస్థలకు ఫైనాన్స్ నిధుల నుంచి వినియోగిస్తున్నారు. ఇందులోనూ బహుళార్థక తాగునీటి పథకాలకు అత్యధికంగా జిల్లా పరిషత్‌కు వచ్చే నిధులే వాటికి వినియోగిస్తున్నారు. నిర్వహణ, విద్యుత్ ఛార్జీలు డబ్బులు కూడా సకాలంలో ప్రభుత్వాల నుండి రాకపోవడంతో కార్మికులకు వేతనాలు కూడా సక్రమంగా చెల్లించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి తరుణంలో కొన్ని మున్సిపాలిటీలు కూడా తమ వాటాగా ఇవ్వాల్సిన నిర్వహణ ఛార్జీలను జిల్లా గ్రామీణ తాగునీటి సంస్థకు చెల్లించడం లేదు. ఫలితంగా బకాయిలు పేరుకుపోయి నిర్వహణకు నిధుల్లేక అవస్థలు పడే పరిస్థితులు నెలకొన్నాయి.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాడిపత్రి, గుత్తి, కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం పురపాలక సంఘాలకు ప్రత్యేకమైన తాగునీటి వ్యవస్థ లేదు. ఇవి గ్రామీణ తాగునీటి వ్యవస్థ నుంచే కలిపి ఇస్తున్నారు. ఇందుకు పురపాలక సంఘాలు ఏటా నిర్వహణ ఛార్జీలను జిల్లా గ్రామీణ తాగునీటి సంస్థకు చెల్లించాల్సి ఉంటుంది. ఇవి అనేక నెలలుగా చెల్లించకపోవడంతో బకాయిలుగా ఉండిపోతున్నాయి. ఈ నిధులు సకాలంలో చెల్లిస్తే బహుళ తాగునీటి పథకాల నిర్వహణకు కొంత వెసలుబాటు లభించే అవకాశముంటుంది.



రూ.263.32 కోట్ల వరకు బకాయిలు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాడిపత్రి పురపాలక సంఘం బకాయి రూ.31.54 కోట్లు ఉంది. గుత్తి పురపాలక సంఘంకు సంబంధించి రూ.4.47 కోట్లు, కళ్యాణదుర్గం పురపాలక సంఘం రూ.15.73 కోట్లు, మడకశిర రూ.2.37 కోట్లు, హిందూపురం పురపాలక సంఘం రూ.39.18 కోట్లు బకాయిలున్నాయి. మొత్తంగా ఐదు పురపాలక సంఘాల నుంచి కలిపి రూ.93.32 కోట్లు బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. ఇవి కాకుండా జిల్లా పరిషత్ నుంచి కూడా రూ.170 కోట్ల బకాయిలున్నాయి. మొత్తం కలిపి రూ.263.32 కోట్లు బకాయిలున్నాయి. ఇవి చెల్లించాలని గ్రామీణ తాగునీటి సంస్థ అధికారులు ఆయా పురపాలక సంఘాలకు విజ్ఞాపనలు పంపుతున్నా స్పందన ఉండటం లేదు. ఇవి వస్తే నిర్వహణకు కొంత వరకు ఆర్థికపరమైన ఇబ్బందులు తొలిగే అవకాశమున్నట్టు అధికారులు చెబుతున్నారు.

'ఉపాధి'పై కేంద్ర బృందం పరిశీలన

పనుల వివరాలపై ఆరా

ప్రజాశక్తి-యల్లనూరు

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వివిధ శాఖల్లో జరిగిన పనులను కేంద్ర బృందం గురువారం పరిశీలించింది. కేంద్ర ఐఏఎస్ ప్రోగ్రాం అధికారి నవిత దాస్, నాబార్డ్ అధికారి వెంకటేశ్వర్లు జిల్లా అధికారులు పనులను పరిశీలించి వాటి వివరాలను మండల అధికారులతో అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఉపాధి హామీ పథకం కింద రూ.7 కోట్ల పనులు జరిగాయి. ఏ పనులు ఎక్కడ చేశారు.. ఎంత ఖర్చు చేశారు.. బిల్లుల చెల్లింపు తదితర వివరాలను కేంద్ర బృందం క్షుణంగా తెలుసుకుంది. మండలంలోని చింత కాయమంద గ్రామంలో కందకాల పనులను పరిశీలించారు. ఈ పనులను పరిశీలించేందుకు 8 కిలో మీటర్ల మేర కొండ ప్రాంతం నడిచి వెళ్లారు. చింతకాయ మంద నుంచి తిమ్మంపల్లి వరకు వేసిన బిటి రోడ్డు, మల్లగుండ్ల గ్రామంలో పండ్ల మొక్కలు, ఫారం పాండ్, పశువుల షెడ్లు, పశువుల నీళ్ల తోట్లు తదితర వాటిని పరిశీలించారు. పారంపాండ్ పనులు చేసిన చోట కేంద్ర బృందం సభ్యులు మొక్కలు నాటారు. గడ్డంవారిపల్లి గ్రామంలో గ్రామసభ నిర్వహించి గ్రామస్తులతో వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా, పంచాయతీ రాజ్ డీఈ కృష్ణ జ్యోతి, ఏపీడీ పుల్లారెడ్డి, ఎంపిడిఒ కరుణసాగర్, ఇంజినీర్ నరేంద్ర, ఈసి సత్యమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్‌లు జయరాం, కుళ్లాయి స్వామి, చంద్రశేఖర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, పాల్గొన్నారు.

పనుల జాప్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం

టెండర్ దక్కించుకుని పనులు చేయకుంటే ఎలా
గుత్తేదారులపై ఎమ్మెల్యే మండిపాటు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరంలో అభివృద్ధి పనులు నతనడకన సాగటంపై ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నాడు కమిషనర్ బాలస్వామి ఛాంబర్‌లో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. నగరంలో చేపట్టిన పనులు, వాటి పురోగతి తదితర వాటిని వార్డుల వారీగా అధికారులతో అడిగి తెలుసుకున్నారు. బిల్లుల చెల్లింపులో జాప్యం కారణంగా గుత్తేదారులు పనులను వేగవంతంగా చేయడం లేదని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లు దక్కించుకున్న వారు పనులు చేయకుండా అలాగే ఉంటే చూస్తూ ఊరుకోవాల్సిందేనా అంటూ ప్రశ్నించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారులు వాటిని పూర్తి చేసే బాధ్యత తీసుకోవాలన్నారు. అలాకాకుండా బిల్లులు పడితేనే పనులు చేస్తామంటూ ఎలాగని ప్రశ్నించారు. పనులు చేయలేకుంటే సదరు కాంట్రాక్టర్లను తొలగించి, కొత్త వారికి వాటిని ఇవ్వాలని ఆదేశించారు. ఇక సమావేశానికి టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి ఒకే ఒక ఉద్యోగి టిపిఒ శిరీష హాజరు కావడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విభాగం మాదిరిగా సచివాలయం సిబ్బందికి బాధ్యతలు అప్పగించి పనులు పూర్తి చేయించుకోవాలని టిపిఒకు తెలియజేశారు. నగరంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయన్నారు. వీటిపైనా అధికారులు పరిశీలన చేయాలన్నారు. టౌన్ ప్లానింగ్‌లో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టాలని కమిషనర్‌కు సూచించారు. కంపోస్టుయార్డుకు స్థలం కేటాయింపు విషయంపై ఆర్డీవో కేశవ నాయుడుకు ఫోన్ చేసి మాట్లాడారు. నెలలు గడుస్తున్నా స్థల సేకరణ చేయకపోవడం ఏమిటంటూ ఆయపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజువారి చెత్త ప్రస్తుత కంపోస్ట్ యార్డ్‌కు చేరకుండా ప్రత్యామ్నాయ స్థలంలోకి తరలించే ఏర్పాటు చేయాలన్నారు. కాగా అభివృద్ధి పనులకు సంబంధించి వార్డుల వారీగా ప్రతి అంశాన్ని ఎమ్మెల్యే సమావేశంలో సమీక్షించడంతో అధికారులు తెల్లమొహం వేశారు. ఎమ్మెల్యే అడుగుతున్న ప్రశ్నలకు సమాధానాలు లేక అధికారులు మౌనం దాల్చారు.

ఆర్‌డిటిని కాపాడాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ఆర్‌డిటి విదేశీ నిధులకు సంబంధించి ఎఫ్‌సిఆర్‌ఎను వెంటనే పునరుద్ధరించి ఆ స్వచ్ఛంధ సంస్థను కాపాడాలని కోరుతూ మండలంలోని ఉంతకల్లు గ్రామ సర్పంచి హరిజన ముక్కన్న, ఆర్‌డిటి క్యాంప్‌లోని దళితులు గురువారం తహశీల్దార్ మునివేలుకు వినతిపత్రం ఇచ్చారు. సర్పంచి మాట్లాడు తూ ఆర్‌డిటి ఎస్సీ, ఎస్టీ, బిసిల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. అలాంటి సంస్థకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విదేశీ నిధులను అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను వెంటనే పునరుద్ధరించాలని నినాదాలు చేశారు. లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుమారు 50 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

టిడిపి సంస్థాగత ఎన్నికలపై సమావేశం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికలను సజావుగా నిర్మించుకుందామని ఆ పార్టీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు సూచించారు. మండలంలోని సంతే కొండాపురంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో గ్రామ కమిటీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. పార్టీ సభ్యత్వం కార్డు ఉన్న వారికి పార్టీ సంస్థాగత ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసిమెలిసి సమన్వయంతో కమిటీ ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండలంలోని పాలవెంకటాపురం పైదొడ్డి పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఉపాధ్యాయుడు శ్రీరాములు తెలిపారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ నగేష్, వైస్ ఛైర్‌పర్సన్ లలిత, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. వారు మాట్లాడుతూ పాఠశాల ప్రారంభంలోనే ప్రభుత్వం పాఠ్య పుస్తకాలు అందజేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి మెంబర్ శివయాదవ్, ఉపాధ్యక్షుడు నరసయ్యగౌడ్ శ్రీరాములు, నరసింహులు, వీరేష్, గోవిందు, శివ, ఉమాపతి, కమలమ్మ, గీత పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని తహశీల్దార్ భాస్కర్ తెలిపారు. మండలంలోని బోరంపల్లి గ్రామ సచివాలయ ఆవరణలో గురువారం తహశీల్దార్ పాటు ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు యోగాసనాలు వేశారు. తహశీల్దార్ యోగాసానాలు వేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ నెల 21వ తేదీ యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచి మల్లికార్జున, విఆర్‌ఒ జవహర్‌బాషా, కార్యదర్శి నవీన్, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన జిల్లా నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్‌ను గురువారం విజయవాడలో మాజీ మంత్రి సాకే శైలజానాథ్, జివిఎస్ఎస్ నాయకుడు శివశంకర్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివశంకర్ నాయక్ ఆర్‌డిటి ఎఫ్‌సిఆర్‌ఎ రెన్యువల్ అంశాన్ని జగన్‌కు వివరించారు. స్పందించిన జగన్ ఆర్‌డిటి సంస్థకు వైసిపి నుంచి ఎప్పుడూ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నట్లు వారు తెలిపారు. అలాగే కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని శివశంకర్ నాయక్‌కు సూచించిన్లు ఆయన తెలిపారు.

జగన్‌తో శైలజానాథ్, శివశంకర్ నాయక్

యోగా దినోత్సవంలో పాల్గొనండి

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం పిటిసి గ్రౌండ్‌లో ఈ నెల 21వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించే జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. 21వ తేదీ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు గంట సేపు జిల్లా స్థాయి యోగా కార్యక్రమం ఉంటుందన్నారు. ఇందులో దాదాపు 5వేల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాలో 23 లక్షల మంది జనాభా ఉండగా, యోగాంధ్రలో భాగంగా ఇంటింటికి సర్వే చేసి 9,97,518 మంది పౌరులను రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. యోగాలో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి ఒక్కరూ ఆయా కేంద్రాల్లో నిర్వహించే యోగా కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. అన్ని విద్యాలయాల్లో యోగా కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది యోగాలో పాల్గొని ప్రపంచ రికార్డు చేయగలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి జి.రామకృష్ణారెడ్డి, డిఎంహెచ్‌ఒ డా॥ఈబి.దేవి, ఆయుష్ అధికారి డా॥రామ్ కుమార్, పాల్గొన్నారు.

పిటిసిలో యోగా డే నిర్వహణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పిటిసిలో ఏర్పాట్లు పరిశీలన

21న అనంతపురం పిటిసి గ్రౌండ్‌లో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ గురువారం పరిశీలించారు. ఆర్డీవో కేశవులు నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఈబి.దేవి, డీఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలన చేశారు. యోగా కోసం పిటిసికి వచ్చే వారు యోగాసనాలు చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

బదిలీ తేదీపై స్పష్టత ఇవ్వాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తెలుగు, హిందీ పాఠశాల సహాయకుల రిలీవింగ్, జాయినింగ్ తేదీలపై స్పష్టత ఇవ్వాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) శ్రీ సత్య సాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం అనంతపురం విద్యాశాఖధికారి ఎం.ప్రసాద్ బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శెట్టిపి జయ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, అనంతపురం జిల్లా అధ్యక్షులు గోవింద రాజులు, ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య మాట్లాడుతూ తెలుగు, హిందీ పాఠశాల సహాయకుల రిలీవింగ్, జాయినింగ్ విషయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు స్థానిక మండలాల్లోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. 2025 లో జరిగిన బదిలీలలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారులు 8/06/25న విడుదల చేసిన ఉత్తర్వులు ప్రకారం తెలుగు, హిందీకి సంబంధించిన ఉపాధ్యయులు 08/06/2025 రిలీవ్ అయ్యి, 09/06/2025 నూతన పాఠశాలల్లో జాయిన్ కావాలని చెప్పారన్నారు. పాఠశాల సహాయకులు తెలుగు, హిందీకి సంబంధించి తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు రిలీవ్ కాకూడదని 08/06/2025న సాయంత్రం ఉత్తర్వులు ఇచ్చారన్నారు. ఈ ఉత్తర్వులు అనుసరించి భాష పాఠశాల సహాయకులు ఆరోజు బదిలీ పొందిన పాఠశాలలో చేరకుండా పూర్వపు పాఠశాలలోనే డిప్యూటేషన్ కింద హాజరు అయ్యారన్నారు. 15/06/25న విడుదల చేసిన ఉత్తర్వుల్లో 14వ తేదీ రిలీవింగ్ 15న జాయినింగ్ అని కొంతమంది, 15న రిలీవింగ్ 16న జాయినింగ్ అని కొంతమంది ఉపాధ్యాయులు ఉన్న నేపథ్యంలో ప్రధానోపాధ్యాయుల్లో సందిగ్ధత ఉందన్నారు. దీనిపై విద్యాశాఖ అధికారులు స్పందించి ఈ ఉపాధ్యాయులకు స్పష్టమైన తేదీని జిల్లావ్యాప్తంగా ప్రధాన ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బదిలీ పొందిన వారికి క్యాడర్ స్ట్రెంగ్త్ ఇస్తూ సకాలంలో జీతాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఎంటిఎస్ ఉపాధ్యాయులకు స్థానిక మండలాల్లోనే పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. దీనిపై డిఇఒ స్పందిస్తూ వీటిపై రెండు రోజుల్లో స్పష్టమైన ఆదేశాలు ఇస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్, నారాయణ స్వామి, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

విన్సెంట్ ఫెర్రర్‌కు నివాళి

నివాళులు అర్పిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ అని టిడిపి నాయకులు కొనియా డారు. ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా గురువారం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ లక్ష్మిదేవి, వైస్ ఛైర్మన్ రాజ శేఖర్, సీనాయర్ నాయకుడు మల్లికార్జున ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఫాదర్ ఫెర్రర్ ఆర్‌డిటి సంస్థ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలను ఆదుకున్నారని గుర్తు చేశారు. విద్య, వైద్యం, రైతులకు సబ్సిడీ పరికరాలు, పండ్ల తోటల పెంపకం, తదితర ఎన్నో ప్రజాపయోగకరమైన కార్యక్రమాలు చేపట్టా రన్నారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచనల మేరకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మురళి, శర్మాస్, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి : ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఫాదర్ ఫెర్రర్ ఆలయంలో ఆర్‌డిటి ప్రోగ్రామ్ డైరెక్టర్ మాంచూ ఫెర్రర్, ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బద్దేనాయక్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. వారు మాట్లాడుతూ ఆర్‌డిటి నిర్వహిస్తున్న 'స్పందించు- సాయమందించు' కార్యక్రమం ఎంతో గొప్పదన్నారు. ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా సుమారు 500 మందికి అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే కుసుమగిరి ప్రయివేట్ కంపెనీ లిమిటెడ్ వారు అందిస్తున్న చిరుధాన్యాలను వంద మంది రైతులకు పంపిణీ చేశారు. ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా రైతులకు చిరుధాన్యలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని కుసుమగిరి ప్రయివేట్ కంపెనీ లిమిటెడ్ సీఈఓ డిఎం నరసింహమూర్తి పేర్కొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సఖీ కేంద్రం (వన్ స్టాప్ సెంటర్)లో పనిచేసే సిబ్బంది విధులను నిర్లక్ష్యం చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళాల సంక్షేమానికి అములు చేస్తున్న కార్యక్రమాలపై మహిళలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలియజేశారు. గురువారం నాడు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆసుపత్రి ఆవరణలో ఉన్న సఖీ కేంద్రం (వన్ స్టాప్ సెంటర్)ను జిల్లా మహిళ శిశు అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమణి, ఆర్‌ఎంఒ డా॥హేమలత, అర్బన్ తహశీల్దార్ హరితో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సఖీ కేంద్రంలో ప్రతి నెలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఆర్‌ఎంఒ పద్మజ, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మాణిక్యరావు, డిసిపిఒ మంజునాథ్, ఎస్‌ఐ భారతి పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

చిన్నపిల్లలు వ్యాధులు బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటిద్దామని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో గురువారం ఆయన సిహెచ్‌ఒ రాణి ఎస్తేర్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఓఆర్‌ఎస్, జింక్ కార్నర్ ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాల్లో భాగంగా ఈ నెల 16 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలురు, బాలికల ఇళ్లల్లో ఒఆర్‌ఎస్ ప్యాకెట్, 14 జింక్ మాత్రలు ఇవ్వాల న్నారు. చిన్నపిల్లల్లో కళ్లు లోపలికి వెళ్లడం, నాలుక, పెదవులు ఎండిపోవడం, చర్మం సాగడం, నీరు దప్పిక కావడం, పాలు తాగకపోవడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాల న్నారు. సమావేశంలో ఫార్మాసిస్ట్ మహేష్, ల్యాబ్ టెక్నీషియన్ పవన్, సూపర్వైజర్ రామలక్ష్మి, సచివాలయ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ కోసం పోరాటం ఆగదు

వైసిపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ రంగయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి ఆర్‌డిటి(రూరల్ డెవలవ్‌మెంట్ ట్రస్ట్)ని కాపాడుకుందా మని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ తలారి రంగయ్య పిలుపునిచ్చారు. మతం ముసుగు అంట గట్టి స్వచ్ఛంధ సంస్థను మూసేస్తామంటే చూస్తూ ఊరుకోమని ఘాటుగా హెచ్చరించారు. ఆర్‌డిటి విదేశీ నిధులకు సంబంధించి ఎఫ్‌సిఆర్‌ఎ(ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్)ను రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర 16వ రోజైన గురువారం ముగిసింది. దీంతో పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం సర్కిల్ బహిరంగ సభ నిర్వహించారు. అనంత మాట్లాడుతూ ఆర్‌డిటికి ఎదురైన ఆటంకాలపై ఉమ్మడి జిల్లాలోని కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేద న్నారు. ఇంతటితో పోరాటం ఆగదని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయిస్తామని తెలిపారు. ఆర్డీటీ పరిరక్షణపై పార్టీ అధినేత జగన్‌తో చర్చించాక భవిష్యత్తు కార్యాచరణ కూడా ఉంటుందని స్పష్టం చేశారు. పార్లమెంట్ పరిశీలకులు నరేష్‌రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, సీనియర్ నాయకులు ఉమామహేశ్వర్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి ఆర్‌డిటిని కాపాడటంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మంగమ్మ, జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మహాలక్ష్మి శ్రీనివాస్, కోగటం విజయబాస్కర్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, పాల్గొన్నారు.

పాదయాత్ర ముగింపు సభలో మాట్లాడుతున్న రంగయ్య

పోలీసుల అడ్డంకులు..

'సేవ్ ఆర్‌డిటి' పాదయాత్ర ముగింపు కార్యక్రమం పోలీసుల అడ్డంకులు, ఉద్రిక్తతల మధ్య కొనసాగింది. ఉదయాన్నే పట్టణ సిఐ యువరాజు, స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసులు మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లిలో రంగయ్య బస చేసిన శిబిరం వద్దకు చేరుకున్నారు. స్థానిక రాయదుర్గం రోడ్డులోని గాంధీ విగ్రహం మీదుగా ఆర్‌డిటి ఆసుపత్రి వద్ద ఫాదర్ ఫెర్రర్ విగ్రహం వద్దకు పాద యాత్ర చేరుకొని అక్కడే సభ నిర్వహించేలా అనుమతులు ఉన్నాయి. అయితే గాంధీ విగ్రహం నుంచి పట్టణంలోకి పాదయాత్ర ప్రవేశించకుండా దొడగట్ట వైపు మళ్లించి అక్కడి నుంచి జగ్జీవన్‌రామ్ సర్కిల్‌కు చేరుకునేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. అధికార పార్టీ పెద్దల కనుసన్నుల్లోనే పోలీస్ అధికారులు ఇలా వ్యవహరించారని వైసిపి నాయకులు విమర్శలు గుప్పించారు.

పారిశుధ్య కార్మికుని మృతికి సిఐటియు నివాళి

నారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

తాడిపత్రిలో అవుట్ సోర్సింగ్ కార్మికుడిగా పని చేస్తున్న మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన కె.నారాయణ మృతికి సిఐటియు నాయకులు నివాళు లర్పించారు. నారాయణ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న సిఐటియు నాయకులు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు, కార్మికులు గురువారం మృతుడి ఇంటికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు ఉమాగౌడ్ మాట్లాడుతూ నారాయణ తాడిపత్రి మున్సిపాలిటీలో పారిశుధ్య సేవలు అందించారన్నారు. అలాంటి ఆయన దహన ఖర్చుల నిమిత్తం అధికారులు రూ.15వేలు కూడా ఇవ్వలేదంటే వారి పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. వెంటనే తాడిపత్రి మున్సిపల్ కమిషనర్ తక్షణమే స్పందించి మృతుడి కుటుంబానికి రూ.15వేలు దహన ఖర్చులు, రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒక్కరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వన్నూరప్ప, రామయ్య, ఆదిలక్ష్మి, మల్లమ్మ, సరస్వతి, శంకర్, శివయ్య, నారాయణ, నల్లప్ప, నరసింహమూర్తి, తిరుమలయ్య, తాడిపత్రి ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి వన్నూరప్ప, అధ్యక్షులు రామయ్య, దానమ్మ, ఆదిలక్ష్మమ్మ, శంకర్, శివయ్య, నారాయణ, నరసింహమూర్తి, శివ శంకర్, నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

21న ఉచిత సంతాన సాఫల్య శిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

డాక్టర్ రాజ్యలక్ష్మి

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో షిరిడీనగర్‌లో ఉన్న శ్రేయా ఆసుపత్రి ఫర్టిలిటీ సెంటర్ (టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్) ఆధ్వర్యంలో ఈనెల 21న శనివారం ఉచిత సంతాన సాఫల్యతా శిబిరం ఏర్పాటు చేయనున్నటు ఆసుపత్రి మేనేజ్‌మెంట్ డాక్టర్ జి.చంద్రమోహన్, డాక్టర్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో వారు మాట్లాడుతూ శ్రేయ ఆసుపత్రిలో ఆధునిక సంతాన సాఫల్యత సేవలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల21న నిర్వహించనున్న ఉచిత వైద్యశిబిరంలో కన్సల్టేషన్, కౌన్సిలింగ్, కంప్యూటరైజ్డ్ సెవెన్ అనాలసిస్, ఫెర్టిలిటీ యూఎస్జి స్కాన్ ఉచితంగా అందించడంతోపాటు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఐయుఐ/ ఐవిఎఫ్‌లో ప్రత్యేక డిస్కౌంట్ అందించనున్నట్లు చెప్పారు. సంవత్సర కాలంగా ప్రయత్నిస్తున్న సంతానం కలగని వారు, నెలసరి క్రమంగా రాని మహిళలు, తరచుగా గర్భస్రావం జరిగే స్త్రీలు, హార్మోన్ లోపం థైరాయిడ్ వంటి సమస్యలు, వీర్యకణాల సమస్యలు, బాధపడుతున్న వారు ఫైబ్రైడ్స్, ఎండోమెంట్ ఆసిస్ వల్ల గర్భం ధరించని, పీసీఓడీ, ఫాలో ట్యూబ్స్ మూసుకుపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్న వారు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 08554-224499 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనంతపురం

కడప వేదికగా ఆగస్టు 23, 24వ తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని రెవల్యూషనరీ స్టూడెంట్ ఫోరమ్(ఆర్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు డిఎం ఓబులేసుయాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం గురువారం శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలని ఏమాత్రం పాటించకుండా కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ జరుగుతోందన్నారు. ఫీజుల దోపిడీపై ఆర్ఎస్ఎఫ్ పోరాటబాట చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ ధ్యేయంగా ఆర్ఎస్ఎఫ్ ఉద్యమించేందుకు ప్లీనరీ సమావేశాల్లో కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కైపు రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షులు మండ్ల రమేష్, నాయకులు మంద విజయ్, బంగారు తిరుపత్తయ్య, కె.ఓబులేసు, నాయకులు శివ, వీర, సురేష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో మెరుగైన సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి-గుత్తి

ప్రభుత్వ వసతి దృహాల్లో మౌలిక సదుపాయాలు మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకోవాలని సహాయ సాంఘిక సంక్షేమ ఇన్‌ఛార్జి అధికారి సి.దామోదర్‌రెడ్డి వసతిగృహాల సంక్షేమ అధికారులను ఆదేశించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలుర వసతిగృహం-1 ఆవరణలో ఉన్న సహాయ సాంఘిక సంక్షేమ అధికారి కార్యాలయంలో వసతి గృహాల సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. వసతి గృహాల్లోని వంటగది, పరిసరాల పరిశుభ్రతపై ఎప్పటికప్పుడు హెచ్‌డబ్ల్యుఓల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ఎస్.రాధాకృష్ణారెడ్డి, వసతి గృహ సంక్షేమ అధికారులు ఆదినారాయణ, సంజీవరాయుడు, మహబూబ్‌బాషా, జగన్నాథ్, ఉమాదేవి, జ్యోతి, జ్ఞానమ్మ, సుగుణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విఆర్ఎ మృతికి నివాళి

శింగనమల : మండలంలోని సోదనపల్లి గ్రామానికి చెందిన రెవెన్యూ సహాయకుడు వెట్టి నారాయణకు తహశీల్దార్ శేషారెడ్డి నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి అంజళి ఘటించారు. అనంతరం కుటుంబానికి మట్టి ఖర్చుల కింద రూ.25 వేలు ఆర్థికసాయం అందించారు. నివాళులర్పించిన వారిలో జిల్లా గ్రామ రెవెన్యూ సహాయక అధ్యక్షులు ఓబులేసు, గ్రామ రెవెన్యూ సహాయకులు ఏకిల వెంకటేష్, ధన, ఆంజనేయులు, శ్రీనివాసులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు ఆర్ఐగా మదన్‌మోహన్‌రెడ్డి

పుట్లూరు : మండల ఆర్ఐగా మధుసూదన్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. మండలంలో గతేడాది నుంచి ఆర్ఐ పోస్టు ఖాళీగా ఉంది. ఈనేపథ్యంలో ఆత్మకూరులో ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న మదన్‌మోహన్‌రెడ్డిని పుట్లూరుకు బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు.

ఐటిఐ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ఉరవకొండ : ఉరవకొండ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో 2025 విద్యా సంవత్సరానికి మొదటి విడతలో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.మహబూబీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 15వతేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్ 99851 46746, 99493 61066 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మండల సర్వసభ్య సమావేశం

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రాఘవరెడ్డి అధ్యక్షతన గురువారం సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో మోటార్ల మరమ్మతులకు తక్కువ మోతాదులో బిల్లుల చెల్లింపుపై పలువురు సర్పంచులు ఏకరువు పెట్టారు. తక్కువ బిల్లులు మంజూరు చేస్తే ఎలా మరమ్మతులు చేయించాలని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ప్రవీణ్‌ను ప్రశ్నించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి పరిధిలో నిర్వహిస్తున్న పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలమ్మ, డీటీ మహబూబ్‌బాషా, ఎంఇఒ శ్రీదేవి, వైద్యాధికారి శ్రీవాణి, ఎఒ కాత్యాయిని, ఎపిఎం వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ల్యాప్‌టాప్‌లు పంపిణీ

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని 120 మంది మెప్మా రీసోర్స్‌పర్సన్లకు గురువారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ డిజిటల్ ఇండియా రూపొందించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా రీసోర్స్‌పర్సన్లకు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే కార్పొరేషన్‌కు 120 ల్యాప్‌టాప్‌లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ బాలస్వామి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విశ్వజ్యోతి, సిటీమిషన్ మేనేజర్ కాటమయ్య, భవానీ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ స్కేటింగ్‌లో సత్తా

స్కేటింగ్‌లో సత్తా చాటిన జయసూర్యమ్మ

అనంతపురం : అనంతపురానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి బండి జయసూర్యమ్మ స్పీడ్ స్కేటింగ్ ఇన్‌లైన్ విభాగంలో ప్రతిభ కనబరిచింది. ఈనెల 12 నుంచి 14వతేదీ వరకూ రాష్ట్ర 2వ జోనల్ ర్యాంకింగ్ ఓపెన్ ఛాంపియన్‌షిప్-2025 జోన్-1 తిరుపతిలో జరిగిన స్పీడ్ స్కేటింగ్ విభాగంలో రాణించింది. రింక్-5 (500o) రింక్-6 రోడ్-3 1 లాప్ ఈ విభాగంలో వరుసగా 2 బంగారు, ఒక సిల్వర్ పథకాలను కైవసం చేసుకుంది. ఇందుకు కోచ్ నాగేంద్ర, తల్లిదండ్రులు బండి ముత్యాలయ్య, రోహిణిని జిల్లావాసులు అభినందించ్చారు.

వాహనాలు వేలం

అనంతపురం క్రైం : స్థానిక 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న 23 అన్ క్లెయిమ్డ్ వాహనాలను ఈనెల 24వతేదీ మంగళవారం వేలం వేయనున్నట్లు సిఐ ఎన్.జగదీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రూ.3వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని కోరారు. వేలం ముగిసిన తర్వాత వేలం దక్కని వారికి రూ.3వేల డిపాజిట్ డబ్బులు తిరిగి ఇవ్వనున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

యాడికి : మండల పరిధిలోని తిరునాంపల్లి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పరమేశ్వర్ ఆధ్వర్యంలో గురువారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి విషజ్వరాలపై వివరించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేశారు. ఈ కార్యక్రమంలో మేల్ సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎఎన్ఎం ప్రమీల, మేల్ హెల్త్ అసిస్టెంట్ మదిలేటి, ఎంఎల్‌హెచ్‌పి సభిహా, ఆశా కార్యకర్త సరస్వతి, ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కార్మికుల బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-గుత్తి

బైకు ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం గుత్తిలో ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన రహదారుల్లో కొనసాగింది. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ కార్మికుల యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజా, రవిశంకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకంతో పాటు అన్ని సంక్షేమ పథకాలను మున్సిపల్ కార్మికులకు వర్తింపచేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. జీవో నెంబర్ 36 ప్రకారం రూ.21 వేలు జీతాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ విభాగ కార్మిక యూనియన్ ఉపాధ్యక్షుడు ఎస్ఎ మురళి, సహాయ కార్యదర్శులు నరసింహా, ఆది, కోశాధికారి నక్కా శేఖర్, నాయకులు సాదిక్, బాబా, పారిశుధ్య కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సూర్యనారాయణ, ఎన్.రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు కె.మహేష్, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథ్‌రెడ్డి రాజీనామా

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాచమల్లు హరినాథ్‌రెడ్డి రాజీనామా చేశారు. ఈమేరకు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ విజయవాడకు గురువారం లేఖ పంపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొట్టమొదటగా 31-12-2019వతేదీన అప్పటి ప్రభుత్వం జీవో జారీ చేస్తూ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకుండా నిజాయితీగా విధులు నిర్వహించానన్నారు. జిల్లాలో కన్విక్షన్ రేటు తమ కోర్టులోనే ఎక్కువగా ఉందన్నారు. ఈనేపథ్యంలో కేవలం ప్రభుత్వం మారగానే ఎలాంటి కారణాలు తమకు తెలపకుండా తొలగించమని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నందుకు రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. రాజీనామాను డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆమోదించాలని కోరారు.

పాలిసెట్‌పై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని రుద్రంపేట వద్ద ఉన్న పివికెకె ఐటి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహించిన పాలిసెట్-2025 అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. ఇందులో భాగంగా బాలాజీ విద్యాసంస్థల ఛైర్మన్ పల్లె వెంకట కృష్ణకిషోర్ విద్యార్థులకు అమూల్యమైన సూచనలు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జెవి సురేష్‌బాబు, పివికెకె ఐటి పాలిటెక్నిక్ కళాశాల పిన్సిపాల్ జివిఎస్ వైభవ్ పాలిసెట్ కౌన్సిలింగ్‌పై అవగాహన కల్పించారు. దాదాపు 200 మంది విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని వారి సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్య ప్రతినిధి కె.శ్రీకాంత్‌రెడ్డి, అకడమిక్ డీన్ వై.సంతోష్‌కుమార్‌రెడ్డి, ఐటి పిన్సిపాల్ రమేష్‌బాబు, పాలిటెక్నిక్ విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

నార్పల : మండల పరిధిలోని గూగూడు గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీలను ఈనెల 20వతేదీన శుక్రవారం దేవస్థానం ఆలయ ఆవరణలో లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సాకేతపురం శోభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీ

అనంతపురం : అనంతపురం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి ప్రసాద్ ఆదేశాల మేరకు డి.హీరేహాల్ మండల పరిధిలోని జాతీయ రహదారిపై విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న 275 ప్యాకెట్ల బియ్యంతోపాటు ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సిఐ జమాల్‌బాషా, రవీంద్రనాథ్, సిఎస్‌డిటి సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

బుక్కరాయసముద్రం : శింగనమల నియోజకవర్గ పరిధిలోని పేదలకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ రూ.17,28,777 చెక్కులను గురువారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేదలకు కూటమి ప్రభుత్వం అన్నివేళలా అందుబాటులో ఉంటూ ఆదుకుంటుందన్నారు.

విద్యార్థినులకు 'కానుక' అందజేత

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోని మాళాపురం కెజిబివి పాఠశాల విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కానుక కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తులసీప్రియ, సర్పంచు ఆశాలత ఆశాలత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చొరవతో ప్రతి విద్యార్థికీ విద్యార్థి మిత్ర కానుక అందజేస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు వెంకటేసులు, పాఠశాల కమిటీ ఛైర్మన్ మీసేవ నాగరాజు, వైస్‌ఛైర్మన్ హోటల్ రాముడు, వన్నూరుస్వామి, రామాంజినేయులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి తహశీల్దార్‌గా జి.పుణ్యవతి

గుత్తి : నూతన తహశీల్దార్‌గా జి.పుణ్యవతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న డి.ఓబులేసు విడపనకల్లుకు బదిలీ కావడంతో బుక్కరాయసముద్రం తహశీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పుణ్యవతి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బదిలీ అయిన తహశీల్దార్ డి.ఓబులేసు, ఉప తహసిల్దార్ ఎంకె సూర్యనారాయణ, ఆర్ఐ కె.హనుమాన్‌ప్రసాద్, తదితరులు నూతన తహశీల్దార్‌కు పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు వెంకటరాముడు, బాలరాజు, తలారి సురేంద్ర, రఫీ, వీఆర్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల డీటీ బాధ్యతల స్వీకరణ

శింగనమల : మండల డిప్యూటీ తహశీల్దార్‌గా సూర్యప్రతాప్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రకాష్‌రావు నార్పల మండలానికి బదిలీ కావడంతో కూడేరు మండలంలో విధులు నిర్వహించిన సూర్యప్రతాప్ ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు ఓబులేసు, మండల గ్రామ రెవెన్యూ సహాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కల్లమడి మునెప్ప, శ్రీనివాసులు, ధన, ఆంజనేయులు, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

1 నుంచే రేషన్ పంపిణీ చేయాలి

తాడిపత్రి రూరల్ : ప్రతినెలా 1వతేదీ ఉదయం 6 గంటలకే రేషన్ పంపిణీని ప్రారంభించాలని ఇన్‌ఛార్జి తహశీల్దార్ సోమశేఖర్ సూచించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలోని రెవెన్యూ భవన్‌లో రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1వతేదీన రేషన్ పంపిణీ ప్రారంభంతోపాటు ప్రతి ఒక్కరూ ఇకెవైసి చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్ ఇన్‌ఛార్జి శ్రీరాములు, సిఎస్‌డిటి మల్లేష్‌ప్రసాద్, డీలర్లు పాల్గొన్నారు.

జగన్‌ను కలిసిన శైలజానాథ్, సాంబశివారెడ్డి

శింగనమల : మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్, విద్యా శాఖ మాజీ సిఇఒ ఆలూరు సాంబశివారెడ్డి గురువారం అమరావతి తాడేపల్లిలో ఉన్న వైసిపి క్యాంపు కార్యాలయంలో అధినేత జగన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. జగన్‌ను కలిసిన వారిలో వైసిపి నియోజవర్గ యువ నాయకులు సాకే రుత్విక్, నాయకులు పాల్గొన్నారు.

కోట పాఠశాల ఉపాధ్యాయులకు సన్మానం

గుత్తి : పట్టణంలోని కోట ప్రాంతంలో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు ఎం.సుబహాన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. పాఠశాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు బదిలీలు, అలాగే ఉపాధ్యాయులు ఉద్యోగాన్నతులు పొందారు. దీంతో పాఠశాలలో వీడ్కోలు సభ ఏర్పాటు చేసి 15 మంది ఉపాధ్యాయులకు శాలువా, పూలమాలలతో సత్కరించారు.

తహశీల్దార్‌ను కలిసిన ఆర్టీఐ అధ్యక్షులు

బెలుగుప్ప : మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ అనిల్‌కుమార్‌ను రాష్ట్ర ఐక్యవేదిక వ్యవస్థాపకుడు లాల్యానాయక్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లాల్యానాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు ఐక్యవేదిక సమాచార బోర్డులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తహశీల్దార్ కార్యాలయంలో ఆర్టీఐ కార్యకర్తలు అడిగే సమాచారం అందించాలని కోరారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ ఆర్టీఐ కార్యకర్తలు అడిగిన సమాచారం అందించి సహకరిస్తామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో రాజీవ్‌కాలనీ సర్పంచి భర్త మృతి

అనంతపురం : గుంటూరు జిల్లాలోని నరసరావుపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజీవ్‌కాలనీ సర్పంచి ఆశాబీ భర్త హుస్సేన్ మృతి చెందారు. బుధవారం రాత్రి విజయవాడ నుంచి అనంతపురానికి ఆర్టీసీ బస్సులో వస్తుండగా బస్సు రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో బస్సు ఎడమవైపు కూర్చొన్న హుస్సేన్‌కు అక్కడికక్కడే మృతిచెందారు. విషయాన్ని గురువారం ఉదయం పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఆశాబీ కుమారుడు, కూతురు, బంధువులతో కలిసి ప్రమాద స్థలానికి బయలుదేరి వెళ్లారు.

మాజీ సర్పంచు మృతి తీరనిలోటు

అనంతపురం రూరల్ : రాజీవ్‌కాలనీ మాజీ సర్పంచు హుస్సేన్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం తీరనిలోటు అని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. హుస్సేన్ మృతికి నివాళులర్పిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

బ్యాంకు ఉద్యోగి..

కళ్యాణదుర్గం రూరల్ : శెట్టూరు మండలంలోని ములకలేడు గ్రామ యూనియన్ బ్యాంకులో క్యాషియర్‌గా పని చేస్తున్న పార్థసారథి(51) గురువారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. పార్థసారథి ఉదయం అనంతపురం నుంచి కళ్యాణదుర్గంకు వచ్చి అక్కడి నుంచి ద్విచక్ర వాహనంపై ములకలేడు వెళ్తుండగా గొల్లపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో పార్థసారథి మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టినట్లు తెలిపారు.

గుత్తిలో వ్యక్తి..

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ఎస్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం హుస్సేనాపురం గ్రామానికి చెందిన ఖాసీం (63) పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న బంధువుల వివాహానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. ఆర్ఎస్‌లోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఆ ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఘటనపై పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

యువకుడు ఆత్మహత్య

తాడిపత్రి రూరల్ : రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడిపత్రి రూరల్ పరిధిలోని ఆటోనగర్ సమీపంలో ఉన్న పుట్లూరు రోడ్డు రైల్వే గేట్ వద్ద రైల్వే ట్రాక్‌పై గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. రూరల్ పరిధికి చెందిన గన్నెవారిపల్లి కాలనీలో నివాసం ఉంటున్న హుస్సేన్‌బాషా కుమారుడు హుస్సేన్‌బాషా (25) సీట్ కవర్స్ దుకాణంలో పని చేస్తూ మూడు నెలలుగా ఖాళీగా ఉన్నాడు. ఈనేపథ్యంలో హుస్సేన్‌బాషా ఆర్థికంగా ఇబ్బంది పడుతూ మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చీనీచెట్లు నరికివేత

నరికిన చీనీచెట్లను పరిశీలిస్తున్న సిఐ

పుట్లూరు : మండల పరిధిలోని గోపురాజుపల్లి గ్రామంలో గుర్తు తెలియని దుండుగులు చీనీ చెట్లను నరికారు. గ్రామానికి చెందిన నడిపి నారాయణరెడ్డి తనకున్న నాలుగెకరాల పొలంలో రెండేళ్ల క్రితం దాదాపు 500 చీనీ చెట్లను నాటాడు. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 35 చీనీచెట్లను కాళ్లతో తొక్కి విరగగొట్టారు. సమాచారం అందుకున్న సిఐ సత్తిబాబు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌ను రప్పించి పరిశీలించారు. తర్వాత రైతు నడిపి నారాయణరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. విషయం తెలుసుకుని టిడిపి నాయకులు సుదర్శన్ నాయుడు, ఎల్కే చెన్నారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రవికుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పరామర్శించారు. ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE, ANANTAPURAMU
Spl. Marriage Divorce O.P.No: 39/2024
Between:
Shaik Shahanaz ...Petitioner
And
Ramesh @ S.Rafi Shek ...Respondant
Notice to the Respondant
To,
Ramesh @ S.Rafi Shek S/o Anand, Beldar work, R/at D.No.8-431, Mother Teressa Colony, Rudrampeta Panchayath, Anantapuramu Rural
పై నెంబరు కేసులో రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తము 25-06-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(By Order of the Court)
N.P.Sreenivasulu, K.Jagadeeswar Reddy, Advocates,
Ananthapuram. Cell: 9440753607

IN THE COURT OF THE ADDL.SENIOR CIVIL JUDGE ANANTHAPURAMU
H.M.O.P.No: 22/2025
Between:
Rage Vasantha@ Chitra Vasantha ...Petitioner
And
Rage Peddanna ...Respondant
Notice to the Respondant
To,
Rage Peddanna S/o Late Rage Pedda Yellappa, Pathachedalla, B.K.Samudram, Mandal, Anantapur District,
పై నెంబరు కేసులో రెస్పాండెంట్ అయిన మీ హాజరు నిమిత్తము 24-06-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.
(By Order of the Court)
D.V.Prasad Reddy, Advocate
Ananthapuram. Cell: 9849058789

ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్‌కు నివాళి



అనంతపురం గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని పొట్టి శ్రీరాములు కూడలిలో డివైఎఫ్ఐ, కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్,పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, కెవిపిఎస్ అధ్యక్ష, కార్యదర్శులు రామునాయక్, సూరి మాట్లాడుతూ ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ ఇన్సెంట్ ఫెర్రర్, ఆయన సతీమణి అన్నేఫెర్రర్ సేవలు మరువలేనివన్నారు. ఎక్కడో స్పెయిన్‌లో జన్మించి అనంతపురం వచ్చి ఆర్డీటీ సంస్థను స్థాపించి పేతలకు ఎనలేని సేవలు చేస్తున్నారన్నారు. అలాంటి సంస్థకు విదేశీ నిధులు రాకుండా అడ్డుకోవడం బాధాకరమన్నారు. వెంటనే ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎ నిధులను పునరుద్ధరించాలని డిమాండ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు వంశీ, రాఖీ, రంగ, కన్నయ్య, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఉరవకొండలోని ఆర్అండ్‌బి బంగ్లా వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో భాగంగా ఆర్డీటీ జెఎసి ఆధ్వర్యంలో ఆర్అండ్‌బి బంగ్లా నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టి కవిత సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవిప్రసాద్, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు, మాజీ సిడిపిఒ రామాంజినమ్మ, ఆర్డీటీ పరిరక్షణ సమితి సభ్యులు మాజీ ఎంపిపి తిప్పయ్య, సర్పంచు జగదీష్, గోపాల్, ఆనంద్‌రాజు, వెంకటప్ప, చంద్రశేఖర్, భీమా, రవి, సూర్యనారాయణ, లక్ష్మన్న, చెన్నప్ప, రమేష్, యల్లన్న, ఎర్రిస్వామి, తిప్పయ్య, చిన్న ఆంజనేయులు, వన్నూరుస్వామి, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం వజ్రకరూరు మండలం చాబాల ఆర్డీటీ పాఠశాలలో సర్పంచు మల్లెల జగదీష్ ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్ఎను పునరుద్ధరించాలని కోరుతూ ర్యాలీగా వెళ్లి సచివాలయంలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ఉపాధ్యాయులు బుగ్గయ్య, సోమశేఖర్, గ్రామపెద్దలు సాకే పుల్లయ్య, బండారు ఓబులేసు, కురువ లింగమూర్తి, గొల్ల లోకనాథ్, స్టోర్ డీలర్ సాకే నరసింహులు, బండారు గంగన్న, బైనే యల్లప్ప, సాకే దావీదు, బండారు జనార్ధన్, ఓబయ్య, నెట్టికల్లు, మహిళలు వనజమ్మ, ఓబుళమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముందు ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లయన్స్ సభ్యులు, మేధావులు, ఉపాధ్యాయులు, ఆర్డీటీ సిబ్బంది ర్యాలీగా వెళ్ల తహశీల్దార్ ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, స్టాంప్ రైటర్ జూటూరు అబ్దుల్‌రజాక్, లయన్స్ క్లబ్ సభ్యులు కులశేఖర్‌నాయుడు, జాఫర్, జనసేన మండల కన్వీనర్ కోడి సునీల్‌కుమార్, లియో క్లబ్ సభ్యులు సురేష్, పీపుల్ హ్యూమన్ రైట్స్ స్టేట్ జనరల్ సెక్రటరీ గుండా నారాయణస్వామి, ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసయాదవ్, ఆర్డీటీ సిఒ రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లులో నివాళులర్పిస్తున్న కెవిపిఎస్, డివైఎఫ్ఐ నాయకులు

అన్నదానం

అనంతపురం : ఫెర్రర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు విజయ సాయికుమార్, సభ్యులు రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల పరిధిలోని దుర్గం ఆర్డీటీ పాఠశాల ఆవరణలో ఫెర్రర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు సాకే రామాంజనేయులు, సిడిసి మెంబర్లు సాకే పుల్లన్న, పోతులయ్య, వెంకటమ్మ, సాలమ్మ, టీచర్లు పార్వతి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : నగరంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు వ్యవస్థాపకులు ఫెర్రర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమా, డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమన్న, అసిస్టెంట్ లైబ్రరియన్ డి.గోవిందు, సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.